### ఓటేసేందుకు వెళ్తుండగా

# రోడ్డు ప్రమాదం

### ఏడేళ్ల బాలిక మృతి.. తండ్రికి తీవ్ర గాయాలు

శాయంపేట, నవంబర్ 30 : ఓటు వేసేందుకు బైక్‌పై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటన శాయంపేట మండలం గోవిందాపూర్ గ్రామ సమీపంలో గురువారం జరిగింది. దీంతో ఏడేళ్ల చిన్నారి అక్కడికక్కడే దుర్మరణం చెందింది. ఎస్సై దేవేందర్ కథనం ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా నేరేడుపల్లి గ్రామానికి చెందిన బోడకుంట్ల రాంబాబుకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. కూలి పని చేసుకుంటూ హనుమకొండ ఏనుగుల గడ్డ ప్రాంతంలో రాంబాబు కుటుంబం నివసిస్తున్నది. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు రాంబాబు, భార్యతో కలిసి బైక్‌పై బయలు దేరాడు. భార్య, చిన్న కూతురును ములుగురోడ్డు వద్ద బస్సు ఎక్కించాడు. పెద్ద కూతురు వైష్ణవిని బైక్‌పై ఎక్కించుకుని ఇద్దరు వస్తుండగా గోవిందాపూర్ ఈఆర్‌ఆర్ క్రషర్ వద్ద ఎదురుగా గుర్తు తెలియని వాహనం వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో చిన్నారి వైష్ణవికి తీవ్ర గాయాలు కాగా, అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. రాంబాబు తలకు తీవ్ర గాయాలు కావడంతో వరంగల్‌కు తరలించగా, వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. ఓటేసేందుకు సొంతూరుకు వెళ్తున్న సందర్భంలో గుర్తు తెలియని వాహనం ఢీకొని చిన్నారి మృతి చెందడం గ్రామస్తులను తీవ్రంగా కలచివేసింది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# ‘కొమ్మూరి’ కొడుకు ఓవరాక్షన్

- జనగామలోని అంబేద్కర్‌నగర్ పోలింగ్ కేంద్రం వద్ద హల్‌చల్
- సమయం ముగిసిన తర్వాత కేంద్రం లోపలికి వెళ్లేందుకు యత్నం
- గేటు తీయాలని పోలీసులపై ఒత్తిడి
- లోపలికి అనుమతించిన ఆర్వో
- అభ్యంతరం తెలిపి ఆందోళనకు దిగిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు
- కేంద్రానికి చేరుకొని పోలీసులను నిలదీసిన అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- బీఆర్‌ఎస్ కార్యకర్తలపై లాఠీఛార్జి



బీఆర్‌ఎస్ కార్యకర్తలపై లాఠీఛార్జీ చేస్తున్న పోలీసులు



ఆందోళన నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ కార్యకర్తలు

జనగామ, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ) : జనగామ పట్టణంలోని అంబేద్కర్‌నగర్ పోలింగ్ కేంద్రం వద్ద గురువారం రాత్రి మరోసారి ఉద్రిక్తత వాతావరణం నెలకొన్నది. పోలింగ్ సమయం ముగిసిన కేంద్రం వద్ద భారీ సంఖ్యలో బారులు తీరిన ఓటర్లను లోపలికి అనుమతించిన ఎన్నికల అధికారులు గేటును మూసివేశారు. పెద్ద సంఖ్యలో ఓటర్లు ఉన్నారనే సమాచారం అందుకున్న కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కుమారుడు ప్రశాంత్‌రెడ్డి పోలింగ్ కేంద్రం లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. సమయం ముగిసిన తర్వాత బయటి నుంచి ఎవరికీ అనుమతి లేదని పోలీసులు తేల్చి చెప్పడంతో తాను అభ్యర్థి తరుపున ఏజెంట్‌గా అన్ని కేంద్రాలకు ఎప్పుడైనా వెళ్లి రావచ్చు అంటూ వాగ్వివాదానికి దిగి ఆర్వో అనుమతితో లోపలికి వెళ్లాడు. కాంగ్రెస్ అభ్యర్థి కుమారుడు పోలింగ్ కేంద్రంలోకి వెళ్లాడన్న సమాచారం అందుకున్న బీఆర్‌ఎస్ శ్రేణులు భారీ ఎత్తున అక్కడకు చేరుకొని లోపల ఉన్న కాంగ్రెస్ ఏజెంట్‌ను బయటకు పంపాలంటూ ఆందోళనకు దిగారు. అటు కాంగ్రెస్, ఇటు బీఆర్‌ఎస్ శ్రేణులు పోలింగ్ కేంద్రం ముందు భారీగా గుమికూడి నినాదాలు, ప్రతినినాదాలు చేసుకోవడంతో ఉద్రిక్తత నెలకొన్నది. ఇదే సమయంలో అక్కడకు చేరుకున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి కాంగ్రెస్ అభ్యర్థి కుమారుడిని లోపలికి ఎలా పంపిస్తారంటూ డీసీపీ సీతారాం, ఏసీపీ దేవేందర్‌రెడ్డిని నిలదీసి వాగ్వావాదానికి దిగారు. పోలీసు అధికారుల తీరుపై బీఆర్‌ఎస్ శ్రేణులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ వాదనకు దిగడంతో వారితో అభ్యర్థి పల్లా ఉండగానే పోలీసులు లాఠీఛార్జి చేసి చెదరగొట్టారు. తమపై పోలీసు అధికారులు దౌర్జన్యం చేస్తున్నారటూ బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. లోపల ఉన్న కాంగ్రెస్ అభ్యర్థి కుమారుడి బయటకు పంపిన డీసీపీ బీఆర్‌ఎస్ పోలింగ్ ఏజెంట్ బండ యాదగిరిరెడ్డిని సైతం లోపలికి అనుమతించడంతో గొడవ సద్దుమణిగింది. భారీ బందోబస్తు నడుమ ఆలస్యంగా ఈవీఎంలను సోషల్ వెల్ఫేర్ జూనియర్ కాలేజీకి తరలించారు. ఇదిలా ఉండగా పోలీసుల తీరుపై బీఆర్‌ఎస్ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేశారు.

## బావిలో పడి వ్యక్తి మృతి

బచ్చన్నపేట, నవంబర్ 30 : బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని మన్‌సాన్‌పల్లిలో గురువారం వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. వివరాల్లోకి వెళ్తే.. మన్‌సాన్‌పల్లి గ్రామానికి చెందిన దేవర లక్ష్మయ్య (45) గత నెల 28న ఇంట్లో నుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు రెండు రోజులు వెతికినా కనిపించలేదు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన అన్నెబోయిన రమేశ్ బావిలో చెప్పులు కన్పించడంతో శవాన్ని బయటకు తీయడానికి సర్పంచ్ పంజాల తార శ్రీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో ముమ్మర ప్రయత్నం చేశారు. మోటర్లు పెట్టి నీళ్లు బయటకు తోడారు. అయినా నీటి ఉధృతి తగ్గపోవడంతో అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగారు. గురువారం సాయంత్రం వరకు ఎట్టకేలకు మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడికి భార్య అరుణ, ఇద్దరు కుమారులు , కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

## రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

గీసుగొండ, నవంబర్ 30 : రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని కొమ్మాల శివారులోని వరంగల్ నర్సంపేట ప్రధాన రహదారిపై గురువారం సాయంత్రం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపురం మండలం రంగంపేట గ్రామానికి చెందిన వాంకుడోత్ రవీందర్ వరంగల్‌లో ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు భార్య మానస, పిల్లలు చైతన్య, హర్షవర్ధన్‌తో కలిసి సొంత గ్రామం రంగంపేటకు వెళ్లారు. ఓటు హక్కు వినియోగించుకొని సాయంత్రం తిరిగి తమ ద్విచక్రవాహనంపై వరంగల్‌కు వస్తున్న క్రమంలో కొమ్మాల ఆర్చిగేటు వద్ద వరంగల్ నుంచి నర్సంపేటకు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి ఎదురుగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108 ద్వారా క్షతగాత్రులను వరంగల్ ఎంజీఎం దవాఖానకు తరలించగా, చికిత్స పొందతున్నారు. మానస ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండడంతో కుటుంబ సభ్యులు ఆమెను హనుమకొండలోని ప్రైవేట్ దవాఖానకు తరలించారు. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనం నుజ్జునుజ్జయింది. కారు రోడ్డు పక్కన బోల్తా పడడంతో అందులో ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. పెద్ద ప్రమాదం కాకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు.

# బీఆర్‌ఎస్ కార్యకర్తపై దౌర్జన్యం..

- ఒక్కటైన బీజేపీ, కాంగ్రెస్, సీపీఎం
- అభ్యర్థి పల్లా సమక్షంలోనే బీఆర్‌ఎస్ కార్యకర్త జోగు కృష్ణప్రసాద్‌పై భౌతికదాడి
- చేయిచేసుకున్న బీజేపీ అభ్యర్థి ఆరుట్ల, పిడిగుద్దులతో సీపీఎం నాయకుల దాడి
- బీఆర్‌ఎస్ ముఖ్యనేత ఎన్నికల సంఘం గుర్తింపుకార్డు లాక్కొని దాడికి యత్నం
- పట్టణంలోని పలుచోట్ల పోలింగ్ కేంద్రాల్లో ఘర్షణ వాతావరణం సృష్టించిన కాంగ్రెస్
- ప్రెస్టన్, స్టేషన్‌రోడ్ కేంద్రాల వద్ద ఉద్రిక్తత



బీఆర్‌ఎస్ కార్యకర్తపై దాడి చేస్తున్న బీజేపీ, కాంగ్రెస్, సీపీఎం నాయకులు

జనగామ, నవంబర్ 30 (నమస్తే తెలంగాణ) : పోలింగ్ వేళ జనగామ పట్టణంలో కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం వంటి ప్రతిపక్ష పార్టీలన్నీ ఒక్కటై బీఆర్‌ఎస్ కార్యకర్తలపై దాష్టికానికి పాల్పడ్డారు. గురువారం ఓటింగ్ ప్రారంభమైన తర్వాత పలు పోలింగ్ కేంద్రాల వద్ద ప్రతిపక్ష పార్టీలన్నీ కలిసి రెచ్చగొట్టేలా వ్యవహరిస్తూ ఘర్షణ వాతావారణాన్ని సృష్టించి గొడవలు పెద్దవి చేసేందుకు ప్రయత్నించారు. తొలుత ప్రెస్టన్ స్కూల్ పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ సరళిని పరిశీలించేందుకు వెళ్లిన బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఓటర్లను ప్రభావితం చేసేలా బూత్‌లో ఎక్కువ సమయం గడుపుతున్నారంటూ కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం నాయకులు పోలీసు అధికారులతో వాగ్వివాదానికి దిగారు. దీంతో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. బీఆర్‌ఎస్ ముఖ్య నాయకుడు రావెల రవి ఎన్నికల సంఘం గుర్తింపు కార్డును లాక్కొని చించి వేయడంతో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లాతో సీపీఎం నాయకుడు బూడిద గోపి వాగ్వాదానికి దిగాడు. అంతకు ముందు జనగామ రైల్వేస్టేషన్ సమీపంలోని పోలింగ్ బూత్ వద్ద కూడా ఇదే రకమైన ఆరోపణలతో కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం నాయకులు ఘర్షణ వాతావరణం సృష్టించేందుకు ప్రయత్నించారు. అక్కడ పోలింగ్ బూత్‌లో బీఆర్‌ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఓటింగ్ సరళిని పరిశీలిస్తుండగా, ఎక్కువసేపు లోపల ఉన్నాడంటూ కాంగ్రెస్ అభ్యర్థి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి కుమారుడు సహా మరికొందరు అభ్యంతరం వ్యక్తం చేస్తూ వాగ్వాదానికి దిగారు. పల్లా పోలింగ్ కేంద్రం లోపల ఉండగానే అక్కడకు చేరుకున్న బీజేపీ అభ్యర్థి ఆరుట్ల దశమంత్‌రెడ్డి పట్టణంలోని 4వ వార్డుకు చెందిన జోగు కృష్ణ ప్రసాద్ అనే బీఆర్‌ఎస్ కార్యకర్తను నాన్‌లోకల్ వాడివి నీకు ఇక్కడేం పని అంటూ తీవ్ర పదజాలంతో దూషిస్తూ చేయి చేసుకున్నాడు. అంతటితో ఆగకుండా కాంగ్రెస్, బీజేపీ, సీపీఎం కార్యకర్తలు బీఆర్‌ఎస్ కార్యకర్తలను చొక్కా పట్టుకొని ఆవరణలోకి లాక్కెళ్లి దాడి చేశారు. చొక్కా చింపి పోలీసులు ఆపుతున్నా ఆగకుండా దాడి చేశారు. అంతేకాకుండా బీఆర్‌ఎస్ అభ్యర్థి పట్టణంలో దొంగఓట్లు నమోదు చేయించారని ఆరోపిస్తూ పట్టణంలోని పలుచోట్ల పోలింగ్ కేంద్రాల వద్ద కాంగ్రెస్ నాయకులు ఘర్షణ సృష్టించి రాజకీయ లబ్ధిపొందేందుకు ప్రయత్నించారు. వ్యవసాయ మార్కెట్ ప్రాంతంలోని మరో పోలింగ్ బూత్‌లో కూడా బీఆర్‌ఎస్ కౌన్సిలర్ శ్రీజ భర్త రామనోహర్‌పై బీజేపీ నాయకులు దాడి చేశారు. పోలీసులు పలుసార్లు జోక్యం చేసుకొని స్వల్ప లాఠీ చార్జి చేసి ఇరు వర్గాలను కేంద్రాల దగ్గరి నుంచి బైటికి పంపారు.

## మొరాయించిన ఈవీఎంలు

నల్లబెల్లి: పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. మండలంలోని 30వేల 457 ఓటర్లు కాగా, మహిళలు 15వేల 422, పురుషులు 15వేల 35 ఉన్నారు. 38 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేసింది. మూడుచెక్కలపల్లిలో గంట పాటు ఈవీఎం మొరాయించడంతో ఓటర్లు ఎండలో ఇబ్బంది పడ్డారు. పలు పోలింగ్ బూత్‌లలో తక్కువ సంఖ్యలో ఎన్నికల అధికారులను నియమించడంతో పోలింగ్ మందకొడిగా సాగింది. ఏసీపీ తిరుమల్, సీఐ పుల్యాల కిషన్, ఎస్సై నైనాల నగేశ్ ఆధ్వర్యంలో పోలింగ్ బూత్‌ల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ధర్మతండాలో తోపులాట

చెన్నారావుపేట: మండల వ్యాప్తంగా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. గురువారం ఎన్నికల పోలింగ్‌లో మండలంలోని ధర్మతండాలో చిన్న తోపులాట మినహా మండలంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ప్రజలు పూర్తిగా తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు మండల ఎన్నికల అధికారి ఫణికుమార్ తెలిపారు. ప్రజలు ఎక్కువ సంఖ్యలో ఓటింగ్‌లో పాల్గొన్నారని, యువత ఎక్కువ సంఖ్యలో మొదటిసారి ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★రామకృష్ణ గ్రూప్ (AP, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. వృద్ధుల/పేషెంట్ల సేవకు వర్కర్లను 24x7 మీ ఇంటికి పంపగలము. 9281452762, 9515108830.
NT-314461

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
9182777213
WARANAGAL
9182777556
9182777557
9182777558
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565